184 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 9: జిల్లాలో వానకాలం సీజన్‌కు సంబంధించి మొత్తం 2 లక్షల 11 వేల 111 టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నదని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 184 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలు మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం

బీఆర్ఎస్ నేతలు సోమిరెడ్డి, లచ్చిరాం, బాబ్జీలను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

రామచంద్రాపురం, అక్టోబర్ 9: రాష్ట్రంలో 'పోలీస్‌రాజ్' నడుస్తున్నదని, ఎందుకు హౌస్ అరెస్టులు చేస్తున్నారో పోలీసులకే తెలియని పరిస్థితి ఉన్నదని బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం తెల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేత సోమిరెడ్డితోపాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు బాబ్జీ, లచ్చిరాంనాయక్, ఆర్సీపురంలో బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ వేళ ఎందుకు హౌస్ అరెస్టు చేస్తున్నారని ప్రశ్నిస్తే పైనుంచి ఆదేశాలు ఉన్నాయని మాత్రమే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు ఎందుకు అరెస్టులు చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగడం లేదని, పోలీస్‌ల పాలన సాగుతుందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ సర్కార్ సరిగా నెరవేర్చకుండా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వచ్చిందని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ప్రకృతి ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం

అందోల్, అక్టోబర్ 9: అందోల్-జోగిపేట మున్సిపల్ కార్యాలయం పరిధిలోని దుకాణ సముదాయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి ప్రారంభిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వాడకం ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుటుందన్నారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో ఈ కేంద్రం నడుపుతున్నదని, ఇక్కడ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయలతోపాటు పాలు, పాల ఉత్పత్తులు, పప్పులు లభిస్తాయని, ప్రజలు ఈ విక్రయ కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, నాగరాజు, డాకూరి శివశంకర్, సురేశ్, బాగ్యలక్ష్మి లక్ష్మణ్, రేఖప్రవీణ్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

వాడవాడలా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్క చోట చేర్చి మహిళలు సందడి చేస్తున్నారు. ఒక్కేసి పువ్వేసి చందమామ.., బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ క్రమపద్ధతిలో ఆడుతూ సందడి చేస్తున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వెన్నముద్దల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. బతుకమ్మ ఆడిపాడిన తర్వాత బతుకమ్మలను దగ్గర్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 9

కందిలోని బ్యాతోల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జహీరాబాద్: బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ సిబ్బంది

మునిపల్లి: చిన్నచెల్మడలో బతుకమ్మల నిమజ్జనం

గుమ్మడిదల: బతుకమ్మ ఆడుతున్న అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్: మహిళా ఉద్యోగుల బైక్ ర్యాలీ

రామచంద్రాపురం: తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో..

కందిలోని బ్యాతోల్‌లో యువతుల కోలాటం

బతుకమ్మ ఒక సామాజిక ఉత్సవం

బొల్లారంలో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బొల్లారం, అక్టోబర్ 9: బతుకమ్మ ఒక సామాజిక ఉత్సవం అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోనీ మూడో వార్డులో రూ.77 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బతుకమ్మ ఘాట్, హై మాస్ట్ లైట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆవరణలో పాలకవర్గ సభ్యులతో కలిసి జమ్మి మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని వసతులతో బతుకమ్మ ఘాట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, కమిషనర్ మంగతాయారు, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్వో నర్సింహులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

ఎస్పీ చెన్నూరి రూపేశ్

మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 9: జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విచారణలో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎస్‌హెచ్‌వోలు ప్రతి రోజు ఉదయం సిబ్బందితో రూల్‌కాల్ నిర్వహించాలన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన విచారణ చేపట్టాలని, త్వరితగతిన బాధితులకు అండగా నిలవాలన్నారు. పెండింగ్ కేసులను చేధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. తరచూ వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ప్రాధాన్యంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. ఆత్మహత్యల నివారణకు ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో మాట్లాడి అనుమానితులకు పురుగు మందులు విక్రయించకుండా చూడాలన్నారు.

అన్నారంలో బస్టాండ్ ప్రారంభం

అన్నోరోఫార్మా పరిశ్రమ ప్రతినిధులను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 9: అన్నోరోఫార్మా(హెటిరో డ్రగ్స్) పరిశ్రమ సౌజన్యంతో ప్రయాణ ప్రాంగణాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్నారం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి సమీపంలో అన్నోరోఫార్మా పరిశ్రమ ఆర్థికసాయంతో బస్‌స్టాండ్ నిర్మించారు. దీనిని బుధవారం పరిశ్రమ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ బీవీరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మురళి, జయశంకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మద్దీ వీరారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తుపాకుల రాజు, ఈవో సంగీత పాల్గొని పరిశ్రమ ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు.

ఆలయ భూమిని కాపాడాలి

పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన మంగంపేట గ్రామస్తులు

జిన్నారం, అక్టోబర్ 9: మంగంపేట గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 55లో టీజీఐఐసీ ద్వారా అనుమతి పొందిన ఆజాద్ పరిశ్రమ వెంకటేశ్వరస్వామి ఆలయ భూమిని, కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన పల్లె ప్రకృతివనాన్ని పూర్తి ఆక్రమించి వినియోగించుకుంటున్నదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులు ప్రత్యేకాధికారి మల్లేశ్‌కు వివరించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సంవత్సరాలుగా ఉన్న లింకు రోడ్డు, పల్లెప్రకృతి వనంతోపాటు ఆలయానికి చెందిన రెండు గుంటల భూమి సదరు పరిశ్రమ స్వాధీనంలోకి తీసుకున్నదన్నారు. వెంటనే కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలత, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలివ్వాలి

జహీరాబాద్, అక్టోబర్ 9: జహీరాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జహీరాబాద్ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో రోజువారి పనులను నిలిపివేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీని వెంటనే పూర్తి చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 9: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని బాబానగర్‌లో నిర్వహించిన ఏరియా మహాసభలో ఆ పార్టీ జాతీయ నేత సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు మాణిక్యం, నాయకులు యాదగిరి, బాలరాజు, శ్రీనివాస్, ప్రభాకర్, మహేశ్, హనుమంతు, కృష్ణ, నర్సింహులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

కల్హేర్, అక్టోబర్ 9: మండల పరిధిలోని రాపర్తి గ్రామంలో 14వ తేదీన డాక్టర్ బాబాసాహెచ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని యువకులు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, నర్సింలు, బాలు, అశోక్, అరవింద్, స్వామిదాస్, అశోక్, చింటు ఉన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

ఝరాసంగం, అక్టోబర్ 9: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తహసీల్దార్ తిరుమలరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్, ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో కొబ్బరి, మామిడి పండ్ల మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పటేల్, నాయబ్ తహసీల్దార్ యాసిన్, గిర్దావర్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ విజ్ఞాన్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, నాయకులు గుండప్ప, రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ఝరాసంగం, అక్టోబర్ 9: గ్రామ పంచాయతీ విధుల పట్ల కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో సుధాకార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని వనంపల్లి, గంగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గంగాపూర్‌లో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు తెలుసుకొని ఎంపీడీవో ప్రత్యామ్నాయంగా పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగు నీటిని సరఫరాను చేయించారు. వనంపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నల్లాలకు బిరడాలు లేక పోవడం వల్ల నీరు వృథాగా పోయి అన్ని వార్డులకు సక్రమంగా నీటి సరఫరా జరగడంలేదంటూ గ్రామస్తులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ప్రతి నల్లాకు బిరడాలు భిగించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు.

పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు

రామచంద్రాపురం: పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు అందజేస్తున్న కౌన్సిలర్ లచ్చిరాంనాయక్, బీఆర్ఎస్ నేత సోమిరెడ్డి

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు **శ్రీ అశోక్ చౌదరి & రతన్ చౌదరి**, నివాసం: బేగంపేట్, హైదరాబాద్ వారు నందిగామ గ్రామం, పటాన్‌చెరు మండలం, సంగారెడ్డి జిల్లా వద్దగల, **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.15 మరియు 12, **దక్షిణం:** 33'వెడల్పురోడ్, **తూర్పు:** పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి రోడ్, **పడమర:** ప్లాట్ నెం. 17 గల, నందిగామ రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం. 354 మరియు 354/ఆ చే కవర్ చేయబడిన 418 చ.మీటర్లకు సమానమైన 500 చ.గజాల మొత్తం విస్తీర్ణం, నెం. 13 మరియు 14 కలిగిన ఖాళీ నివాస ప్లాట్‌ను **శ్రీ హర్‌చంద్ దేవసి, హడమట రాం దేవసి మరియు భేరా రామ్**, నివాసం: పటాన్‌చెరు వారి నుండి కొనుగోలు చేయుటకు 06-10-2024న బయానాగా మొత్తం వ్యయంలో 25%ను చెల్లించి అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు. కావున, ఎవరేని వ్యక్తి/వ్యక్తులు ఏవేని అభ్యంతరాలు/క్లెయిమ్‌లు ఉన్నచో వారు ఈ బహిరంగ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా అభ్యంతరం/క్లెయిమ్ యొక్క అవసరమైన రుజువుతో సంప్రదించవచ్చును. లేనిచో, నా క్లయింట్లు సదరు అమ్మకం లావాదేవీతో ముందుకు సాగుతారు మరియు ఆతరువాత ఏవిధమైన అభ్యంతరాలు/క్లెయిమ్‌లు అనుమతించబడవు.

ఇందునిమిత్తమే ఈ బహిరంగ ప్రకటన జారీ చేయబడినది.

సం/- కుంచల శ్రీనివాస్, అడ్వకేట్
ఇం.నెం. 2-3-471, సాయినగర్, నాగోల్,
హైదరాబాద్-500 068,
ఫోన్: 9160515123, 9346641251.

మంజీరాలో దూకి యువకుడి ఆత్మహత్య

మనూరు, అక్టోబర్ 9: మంజీరా నదిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మనూరు మండల పరిధిలోని రాయిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు కుమారుడు మున్నూర్ రమేశ్(26)బుధవారం మంజీరాలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పి భరించలేక..

మునిపల్లి, అక్టోబర్ 9: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన మునిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ నాయక్ కథనం ప్రకారం.. మునిపల్లికి చెందిన మన్నే శ్రీశైలం(51) కొంతకలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దవాఖానల్లో చికిత్స చేయించుకున్నా ఎంతకూ తగ్గకపోవడంతో ఈ నెల 5న పురుగు మందు తాగాడు. దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య అనసూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మునిపల్లి, అక్టోబర్ 9: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని బుధేరాలో చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం.. సదాశివపేట పట్టాణానికి చెందిన సాయికిరణ్(29) మంగళవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్‌లో అంత్యక్రియలకు వెళ్లి సదాశివపేటకు తిరుగు ప్రయాణమయ్యాడు. మునిపల్లి మండలంలోని బుధేరా చౌరస్తాలో వాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో సాయికిరణ్ తలకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే 108లో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సబ్ స్టేషన్‌లో ఆయుధ పూజ

మునిపల్లి, అక్టోబర్ 9: మునిపల్లి సబ్‌స్టేషన్లో విద్యుత్ అధికారులు బుధవారం అయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే సబ్‌స్టేషన్లో ఆయుధ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి

అందోల్, అక్టోబర్ 9: స్వాతంత్ర్య సమరయోధుడు, తామరపత్ర గ్రహీత గడీండ్ల లింగమయ్యగౌడ్(96) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం జోగిపేటలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. కౌన్సిలర్ భారతి, రవీంద్రగౌడ్ మృతదేహం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ చైర్మన్ భిక్షపతి ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 10: ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్‌లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఖేడ్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. మొదటి విడుతలోనే నారాయణఖేడ్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి ఉన్నారు.

ఛలో హైదరాబాద్ విజయవంతం చేయండి

మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

అందోల్, అక్టోబర్ 9: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో నవంబర్ 10న హైదరాబాద్‌లో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి మాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా ఉపాధ్యాక్షుడు దేవరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం తాలెల్మలో మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమానికి 25వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, కర్ణాకర్, నాగయ్య, దేవయ్య, రాజు, ప్రసాద్, మాణయ్య, ఏసయ్య, దుర్గయ్య, రాములు, పోచయ్య పాల్గొన్నారు.

చలో కలెక్టరరేట్‌కు తరలిన నేతలు

కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

జహీరాబాద్, అక్టోబర్ 9: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ మాదిగలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరికి నిరసనగా చలో కలెక్టరేట్‌కు ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు నాయకులు తరలివెళ్లారు. ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు బుధవారం నియోజకవర్గం నుంచి తరలివెళ్లారు. నాయకులు అబ్రహం మాదిగ, ఉల్లాస్ మాదిగ, మైఖెల్, సుకుమార్, సునీల్‌కుమార్, రాజు, శ్రీకాంత్, జీవన్, విజయ్, సన్ని, నవీన్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కోహీర్, అక్టోబర్ 9: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని బిలాల్‌పూర్ రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలను సబ్సిడీపై అందజేస్తామని తెలిపారు. పెట్టుబడి ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, పంట ఉత్పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. స్థానికంగా నూనె తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు వ్యాపారస్తులు ముందుకు వస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, తహసీల్దార్ బాలశంకర్, ఏవో నవీన్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, మౌనికవర్మ, సంహిత, స్వాతిరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

చెరుకును కొంటాం

మద్రిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పరిశ్రమ ప్రతినిధి రవీందర్‌రెడ్డి

కోహీర్, అక్టోబర్ 9: రైతులు సాగు చేస్తున్న చెరుకును కొనుగోలు చేస్తామని మాటూర్‌కు చెందిన గోదావరి గంగా చక్కెర పరిశ్రమ ప్రతినిధి రవీందర్‌రెడ్డి హామీనిచ్చారు. బుధవారం మండలంలోని మద్రి గ్రామ చెరుకు రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం బసంతపూర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ చక్కెర పరిశ్రమ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న చెరుకు పంటకు తెగులు సోకకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇప్పటికైనా బిల్లులు చెల్లించండి

భర్త మృతదేహంతో పరిశ్రమ ఎదుట భార్య నిరసన

పటాన్‌చెరు, అక్టోబర్ 9: తన భర్త లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేసిన బిల్లులు ఇప్పుడన్నా చెల్లించాలని తన భర్త మృతదేహంలో ఓ మహిళ పరిశ్రమ ఎదుట బైఠాయించింది. ఈ ఘటన పటాన్‌చెరు మండలం పాశమైలారంలో చోటు చేసుకుంది. భార్య దుర్గ ప్రజాపతి తెలిపిన కథనం ప్రకారం.. ఇస్నాపూర్‌లో బుధవారం సంజయ్ ప్రజాపతి(34) రోడ్డు పక్కన గుంతలో పడి మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పటాన్‌చెరు ఏరియా దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతుడి భార్య దుర్గ భర్త సంజయ్ ప్రజాప్రతి మృతదేహంతో పాశమైలారంలోని ప్రముఖ పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగింది. భర్త ఆ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తుండేవాడని, అతడికి ఆ పరిశ్రమ నుంచి బిల్లులు రావడం లేదని ఆరోపించింది. ఏడాదిన్నరగా రూ.9 లక్షల వరకు రావాల్సి ఉన్నా ఇవ్వడం లేదని రోదిస్తూ తెలిపింది. తన భర్త చనిపోయినందున ఇప్పుడైనా బిల్లులు చెల్లించాలని కోరింది. బిల్లులకోసం నిత్యం పరిశ్రమ చుట్టూ తిరుగుతూ ఆరోగ్యం పాడుచేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త బిల్లులు ఇప్పుడే క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించింది. ఈ మేరకు పరిశ్రమ నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో పరిశ్రమ ఎదుట ఆందోళన కొనసాగిస్తున్నది. ఆమెకు నలుగురు పిల్లలు. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేవని రోదిస్తున్నది. బీడీఎల్ పోలీసులు పరిశ్రమ వద్ద భద్రత కల్పించారు.

పుష్పయాగంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, అక్టోబర్ 9: శ్రీవారి బ్రహ్మోత్సవాలు పుష్పయాగం, అశ్వ వాహన సేవతో ముగిశాయి. బ